క్లుప్తంగా

రేపు భగీరథ మహర్షి జయంతి

కొత్తకోట: పట్టణ కేంద్రంలో ఈ నెల 27న భగీరథ మహర్షి జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు కొత్తకోట సగర (ఉప్పర) సంఘం అధ్యక్షుడు పోతులపల్లి బుచ్చన్న మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం ఉదయం 9 గంటలకు అంబ భవానీ ఆలయం నుంచి భగీరథ మహర్షి మండపం వరకు భారీ ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సగరులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

ఆర్థికసాయం అందజేత



కొత్తకోట రూరల్: పెద్దమందడి మండల కేంద్రానికి చెందిన అద్దాల చిన్నమ్మ (60) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం ఉదయం మృతి చెందింది. చిన్నమ్మకు ఇద్దరు కూతుళ్లు ఉండటంతో కుటుంబ పరిస్థితిని స్థానిక టీఎమ్మార్ యువజన సభ్యుడు ఎంపీపీ మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన మేఘారెడ్డి తక్షణ సాయంగా రూ.5వేలు పంపించారు. టీఎమ్మార్ యువజన సభ్యులు మంగళవారం చిన్నమ్మ మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించడంతో పాటు రూ.5వేలు అందజేశారు. కార్యక్రమంలో ప్రవీణ్‌రెడ్డి, టైలర్ రవి, పాష, నర్సింహా, రాములు, రాజు తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన టీడీపీ, కాంగ్రెస్ నాయకులు



అమరచింత: మక్తల్‌లో ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి సమక్షంలో అమరచింత పట్టణానికి చెందిన పలువురు టీడీపీ, కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు మంగళవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమవుతుందని పార్టీలో చేరిన నాయకులు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ ఎస్ఏ రాజు, అమరచింత మండల, పట్టణ బీఆర్ఎస్ నాయకులు రమేష్ ముదిరాజ్ ,అక్కల నరసింహులు గౌడ్, బాలరాజ్, రఫియోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలి



పాన్‌గల్: పంచాయతీ రాజ్ శాఖలో నాలుగేళ్లుగా ప్రొహిబిషన్ కాలాన్ని పూర్తి చేసుకున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలని కోరుతూ మంగళవారం సీఎం కేసీఆర్‌కు లేఖలు రాశారు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యూలర్ చేస్తూ ఉద్యోగ భద్రత కల్పించాలని సీఎంకే పంపిన లేఖలో వారు పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయం ఎదుట సీఎంకు పంపే లేఖలను ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు.

కాంగ్రెస్‌లో నాయకులను సమన్వయం చేయరా?



వనపర్తి టౌన్: పార్టీలో తగాదాలు, సమస్యలుంటే రాష్ట్ర స్థాయిలో సమన్వయం చేయాల్సిన బాధ్యతలో ఉన్న మాజీ మంత్రి చిన్నారెడ్డి వనపర్తిలో ఎందుకు సమన్వయం చేయట్లేదని పీసీసీ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ సీనియర్ నేత శ్రీనివాస్‌గౌడ్ ప్రశ్నించారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం ఆయన మాట్లాడుతూ.. సీనియర్ నాయకుల మనోభావాలు దెబ్బతినేలా బహిరంగ సమావేశాల్లో చిన్నారెడ్డి మాట్లాడడం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ఇతర పార్టీల నాయకులు సముఖంగా ఉన్నారని, చిన్నారెడ్డి వైఖరి వల్లే వారు సందిగ్ధంలో ఉన్నారని చెప్పారు. ఇకనైనా చిన్నారెడ్డి మారితే కాంగ్రెస్ పార్టీని బతికించుకునే అవకాశం ఉందన్నారు. డీసీసీ మాజీ అధ్యక్షుడు తైలం శంకర్ ప్రసాద్ మాట్లాడుతూ.. బహిరంగ సమావేశాల్లో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాల్సిన చిన్నారెడ్డి కాంగ్రెస్ అంతర్గత విషయాలను ప్రస్తావించడం అనైతికమని మండిపడ్డారు. చిన్నారెడ్డి మమ్మల్ని భుజాలపై మోసానని చెప్పడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు.

ఆర్టీసీ కండక్టర్లకు శిక్షణ

కొల్లాపూర్: ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ రెడ్డి, ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు కొల్లాపూర్ డిపోలో కండక్టర్లకు ఏర్పాటు చేసిన ఏసీటీ శిక్షణ కార్యక్రమం మంగళవారం ముగిసింది. చివరిరోజు శిక్షణ తరగతులకు డిప్యూటీ రీజినల్ మేనేజర్ శ్యామల హాజరయ్యారు.

మలేరియా నివారణకు కృషి



పెద్దమందడిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

అమరచింత: మలేరియాను నివారించడంలో ప్రజలు, యువకులు ఆరోగ్య సిబ్బందికి సహకరించాలని తిప్పుడంపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శరత్ అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం ఆత్మకూర్ పట్టణంలో ఆరోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ శరత్ మాట్లాడుతూ మలేరియా వ్యాప్తిని సున్నా స్థాయికి తీసుకు రావడానికి సమయాన్ని కేటాయించి కావలసిన వనరులను సమకూర్చాలని కోరారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని, నిల్వ నీటితో దోమల వ్యాప్తి పెరిగే అవకాశం ఉన్నందున తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌యూట ఆయూబ్‌ఖాన్, హెల్త్ సూపర్‌వైజర్ సురేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

పాన్‌గల్: మలేరియా నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పీహెచ్‌సీ డాక్టర్ హరినాథ్‌రెడ్డి అన్నారు. ప్రపంచ మలేరియా నిర్మూలన దినోత్సవం సందర్భంగా మంగళవారం వైద్య సిబ్బంది మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటిస్తూ నిల్వ నీటిని పారబోస్తూ నూతన నీటిని పట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది శ్రీనివాసులు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వీపనగండ్ల: మలేరియా వ్యాధిని పూర్తిగా నిర్మూలించడంలో వైద్య సిబ్బంది, ప్రజలు పూర్తి బాధ్యతతో వ్యవహరించినప్పుడే సాధ్యమవుతుందని మండల వైద్యాధికారి వంశీకృష్ణ, అదనపు వైద్యుడు రాజశేఖర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు.

కొత్తకోట రూరల్: ఇంటి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే దోమలను అరికట్టవచ్చని, తద్వారా మలేరియాను పూర్తిగా నివారించవచ్చని పెద్దమందడి మండల పీహెచ్‌సీ డాక్టర్ రచన అన్నారు. మంగళవారం ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో ఆరోగ్య సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రచన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇంటి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంలో భాగస్వాములు కావాలని, ముఖ్యంగా మురుగు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. దోమల నివారణకు సర్పంచ్‌లు ఎప్పటికప్పుడు ఫాగింగ్ చేయించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఓంప్రకాష్, ల్యాబ్ టెక్నీషియన్ మనీషా, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



వీపనగండ్లలో..



ఆత్మకూర్‌లో..



పాన్‌గల్‌లో..

నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమొద్దు



అమరచింత నుంచి పాలమూరుకు వెళ్తున్న బీజేపీ నాయకులు

అమరచింత: మహబూబ్‌నగర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించే నిరుద్యోగ మార్చ్‌లో పాల్గొనేందుకు అమరచింత, ఆత్మకూర్ మండలాల నుంచి నాయకులు మంగళవారం తరలివెళ్లారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులు జీవితాలతో ఆటలాడుతుందని, ఇప్పటి వరకు టీచర్ పోస్టుల కోసం నోటిఫికేషన్ వేయలేదని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మేర్వరాజు అన్నారు. నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం బీజేపీ నిర్వహించే నిరుద్యోగ మార్చ్ కార్యక్రమానికి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ హాజరవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆత్మకూర్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అశ్విన్‌కుమార్, క్యామ భాస్కర్, మేర్వ అనిల్, సురేష్, నరాల నారాయణ, సిద్ధురాములు, దుబాయి వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మదనాపురం: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగిన నిరుద్యోగ మార్చ్ కార్యక్రమానికి దేవరకద్ర బీజేపీ నాయకుడు ఎగ్గని నరసింహులు ఆధ్వర్యంలో కార్యకర్తలు తరలివెళ్లారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, మండల అధ్యక్షుడు కృష్ణ యాదవ్, ప్రధాన కార్యదర్శి రాము, మండల ఉపాధ్యక్షుడు వెంకటేష్, ఉపసర్పంచ్ రామకృష్ణారెడ్డి, భాస్కర్, మల్లేష్, శివ, రామకష్ణ, రమేష్, శివ తదితరులు ఉన్నారు.



మదనాపురం నుంచి..

కొత్తకోట రూరల్: ప్రశ్నపత్రాల లీకేజీకి నిరసనగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో భారతీయ జనతా పార్టీ మంగళవారం నిర్వహిస్తున్న నిరుద్యోగ మార్చ్‌లో పాల్గొనేందుకు పెద్దమందడి మండలం నుంచి నిరుద్యోగులు, బీజేపీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు.

గోపాల్‌పేట: నిరుద్యోగ మార్చ్ సభకు రేవల్లి మండలం నుంచి మండల అధ్యక్షుడు అజయ్‌గౌడ్ ఆధ్వర్యంలో కార్యకర్తలు తరలివెళ్లారు.

కేసు నమోదు

అమరచింత: పట్టణంలోని బీసీ కాలనీలో నివాసం ఉంటున్న ఫర్జానా బేగం ఇంటి తలుపులు, గోడను పగలగొట్టిన నిస్సార్ అనే వ్యక్తితో పాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ శివనాగేశ్వరనాయుడు తెలిపారు. అమరచింత పట్టణానికి చెందిన నసీర్, నిసార్ అన్నదమ్ములు. వీరి మధ్య కొన్నేళ్లుగా ఇంటి వాటాల కోసం గొడవలు జరుగుతున్నాయి. ఆదివారం నసీర్ ఇంట్లో ఎవ్వరూ లేకపోవడంతో మూసి ఉన్న ఇంటి తలుపులతో పాటు గోడను నిసార్ పగలగొట్టాడు. దీంతో నసీర్ భార్య ఫర్జానాబేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

వేతనాలు అందక ఇబ్బందులు



పెబ్బేరు: మండలంలోని వై.శాఖాపూర్‌లో మన ఊరు, మన గుడి కార్యక్రమంపై అర్చకులు మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అర్చకుల సంఘం అధ్యక్షుడు వాసుదేవశర్మ ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు పీవీ లక్ష్మీకాంతాచార్యులు మాట్లాడుతూ ఆలయ పరిరక్షణ, పలు సమస్యలపై చర్చించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం దూపదీప నైవేద్యాలకు ఇస్తున్న రూ.రెండు వేలు, వేతనాలు అందకపోవడం, పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైన ప్రభుత్వం రూ. 22 వేతనం పెంచాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు నటరాజ్, కోశాధికారి రవీంద్రరావు, వెంకటేశ్వర్లు ఉన్నారు.

ముందస్తు అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

పాన్‌గల్: అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని సీఐటీయూ జిల్లా సహాయకార్యదర్శి రాము అన్నారు. విద్యుత్ శాఖలో ఆర్టిజన్స్ ఉద్యోగులుగా పనిచేస్తున్న వారు తమ డిమాండ్ల సాధన కోసం మంగళవారం నుంచి సమ్మె చేపట్టనున్న నేపథ్యంలో వారిని పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. వారిని రాము పరామర్శించి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టిజన్స్ కార్మికులకు స్టాండింగ్ ఆర్డర్లు రద్దు చేస్తూ ఎగ్జిస్టింగ్స్ సర్వీస్ రూల్స్‌ను అమలు చేయాలన్నారు. విద్య అర్హతలను బట్టి పదోన్నతులు ఇవ్వాలని, 50 శాతం పీఆర్సీ రూల్స్ అమలు చేయాలనే డిమాండ్లను పరిష్కరించే వరకు సమ్మెను కొనసాగిస్తారన్నారు. అరెస్టయిన వారిలో రమణ, హాయాజ్‌ఖాన్, చక్రవర్తి, ప్రవీణ్, తిరుపతయ్య, రామకృష్ణ, మోహన్‌రెడ్డి, నర్సింహా, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.



స్టేషన్ ఆవరణలో ఆర్టిజన్స్ విద్యుత్ ఉద్యోగులు

చలివేంద్రం ఏర్పాటు



కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని మద్దిగట్లలో స్వామి వివేకానంద యూత్ ఆధ్వర్యంలో రెండు చోట్ల చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మోజర్ల–మద్దిగట్లలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలు గ్రామస్తుల, వాహనదారుల దాహార్తి తీర్చేందుకు ఎంతగానో ఉపయోగపడుతాయని పలువురు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైస్ఎంపీపీ రఘుప్రసాద్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు సత్యారెడ్డి, రాంచంద్రయ్యగౌడ్, చెన్నకేశవులు, బాలయ్య, యూత్ అధ్యక్షుడు రాములుయాదవ్, ఉపాధ్యక్షుడు నర్సింహ, చందు, నరేష్, వెంకటేష్ సాగర్, వెంకటేష్‌గౌడ్, రాములుగౌడ్, నగేష్, శివరాం, మొగిలి, రవిసాగర్ తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్‌తోనే ప్రజలకు న్యాయం



ఖిల్లాఘనపురంలో బీఆర్ఎస్ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు



అజ్జకొల్లులో..

సాక్షి, నెట్‌వర్క్: రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీతోనే ప్రజలకు న్యాయం జరుగుతుందని జెడ్పీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్ అన్నారు. మంగళవారం బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ వేడుకలను జిల్లా వ్యాప్తంగా ఆ పార్టీ శ్రేణులు ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతు నీళ్లు, నిధులు, నియామకాలు అన్న నినాదంతో ఏర్పడిన రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా మార్చడంలో సీఎం కేసీఆర్ సఫలమయ్యారని కొనియాడారు. రైతు, మహిళలు, చేతి, కుల వృత్తిదారుల సంక్షేమమ లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు ముందుకు వెళ్తుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్లు మంగమ్మ, గాయత్రి, కరుణశ్రీ, ఎంపీపీలు మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, సేనాపతి, బంగారు శ్రీనివాసులు, కృష్ణానాయక్, మార్కెట్ చైర్మన్ ఎస్ఏ రాజు, సింగిల్ విండో అధ్యక్షుడు గాడికృష్ణమూర్తి, పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు రవికుమార్, రమేష్ ముదిరాజ్, నరసింహులుగౌడ్, చింతలపల్లి బాబురెడ్డి, దిలీప్‌కుమార్‌రెడ్డి, రాముయాదవ్, సత్యనారాయణ గౌడ్, ఆవుల బాలకృష్ణ, రాళ్లకృష్ణయ్య, జెడ్పీటీసీలు భీమయ్య, లక్ష్మి, సామ్యనాయక్, కృష్ణయ్య యాదవ్, సింగిల్ విండో చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, మదనాపురంల మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యాపర్లలో 'కంటివెలుగు' శిబిరం ప్రారంభం

పెబ్బేరు: మండలంలోని యాపర్లలో కంటివెలుగు శిబిరాన్ని మంగళవారం సర్పంచ్ చంద్రకళ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం ఉచిత కంటి పరీక్షలు చేసి కంటి అద్దాలు, మందులు అందించడడంతో పాటు అవసరమైన వారికి ఆపరేషన్ కూడా చేయిస్తుందని తెలిపారు. అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉప్ప సర్పంచ్ రామకృష్ణ, అంగన్‌వాడీ టీచర్లు, ఆశవర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ

పెబ్బేరు పట్టణ కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా వైద్యులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది చంద్రశేఖర్, సత్యమ్మ, సూర్యనారాయణ, రాజశేఖర్, తిరుపతయ్య, వెంకటమ్మ, సరోజమ్మ, శిరీష, విజయలక్ష్మి పాల్గొన్నారు.

పరిమితికి మించి ప్రయాణం నేరం

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని గూడ్స్, ప్యాసింజర్ వాహనాల్లో పరిమితి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని మంగళవారం ఎస్ఐ జగదీశ్వర్ తెలిపారు. జిల్లా పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీసులు వాహనాల తనిఖీ చేసి పరిమితికి మించి కూలీలను తీసుకెళ్తున్న ఏడు వాహనాలపై కేసు నమోదు చేశారు. దీంతో పెండింగ్ ఉన్న జరిమానాలను ఆర్టీఓకు పంపడంతో పాటు కూలీలకు, వాహన డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు.

హెల్మెట్ తప్పనిసరి

పట్టణ కేంద్రంలోని పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం హెల్మెట్ లేకుండా బైకులు నడుపుతున్న వారిపై చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ జగదీశ్వర్ మాట్లాడుతూ ఎస్పీ ఆదేశాల మేరకు ద్విచక్ర వాహనదారులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తూ కొత్తకోట బైపాస్ 44వ జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనాలు ఆపి హెల్మెట్ పెట్టుకుంటవా.. ప్రాణాలు కాపాడుకుంటవా.. జరిమానా కడతావా? నినాదంతో సుమారుగా 30 మందికి హెల్మెట్లు కొనుగోలు చేసేలా అవగాహన కల్పించారు.



బహుజనుల రాజ్యాధికారమే లక్ష్యం

వనపర్తి టౌన్: డాక్టర్ విశారధన్ మహారాజ్ స్వరాజ పాదయాత్ర ముగింపు సభకు సంబంధించిన వాల్ పోస్టర్లను మంగళవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో డీఎస్పీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ రాష్ట్ర కమిటీ సభ్యుడు సూర్యప్రకాశ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డీఎస్పీ అధికారంలోకి వస్తేనే.. ప్రజలకు న్యాయం చేయగలదని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య, ఉపాధ్యక్షుడు మన్యం, కోశాధికారి శాంతన్న, జిల్లా కమిటీ సభ్యులు కురుమన్న, ఈశ్వర్, ఎల్లస్వామి, ఆంజనేయులు, నక్క రాములు యాదవ్, చిన్న రాములు, గంధం రవి తదితరులు పాల్గొన్నారు.



వనపర్తిలో వాల్ పోస్టర్లు విడుదల డీఎస్పీ నాయకులు

వాల్‌పోస్టర్ విడుదల

గోపాల్‌పేట: బీసీ, ఎస్సీ, ఎస్టీల స్వరాజ్య స్థాపన కోసం డాక్టర్ విశారధన్ మహారాజ్ చేపట్టిన పదివేల కిలోమీటర్ల పాదయాత్ర ఈనెల 30న ముగుస్తున్న సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించే ముగింపు సభను విజయవంతం చేయాలని డీఎస్పీ నాయకులు కోరారు. మంగళవారం ముగింపు సభకు సంబంధించి వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, లక్ష్మణ్, వెంకటేష్, తరుణ్, శ్రీను పాల్గొన్నారు.

జగద్గురు ఆదిశంకరాచార్యులకు ఘన నివాళి

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని బస్టాండు ఆవరణలో మంగళవారం జగద్గురు ఆదిశంకరాచార్యుల జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త కమ్మరి గోపి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా గోపి, సింగిల్‌విండో వైస్ చైర్మన్ క్యామరాజు, డైరెక్టర్ కృష్ణయ్యగౌడ్ మాట్లాడుతూ ఆదిశంకరాచార్యులు కేరళలో బ్రాహ్మణ కుటుంబంలో జన్మించి, 12వ ఏటనే సన్యాసం తీసుకుని భారతదేశం మొత్తాన్ని కాలినడకన తిరిగి హిందూ ధర్మం గురించి దేశమంతా ప్రచారం చేశారని కొనియాడారు. హిందూ ధర్మవ్యాప్తికి ఆయన చేసిన కృషిని దేశప్రజలు ఎప్పటికీ మరవరన్నారు. కార్యక్రమంలో జిల్లా వడ్డెర సంఘం అధ్యక్షుడు దాసర్ల భూమయ్య, నాయకులు రవీందర్‌రెడ్డి, రామన్‌గౌడ్, దోరటి మల్లేష్, పల్లాటి శ్రీనివాసులు, అంజనేయులుగౌడ్, అంకుశం తదితరులు పాల్గొన్నారు.



ఆదిశంకరాచార్యులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెంచాలి

పాన్‌గల్: మండలంలో నిర్వహిస్తున్న ఉపాధి పనుల్లో కూలీల సంఖ్యను పెంచేలా ఉపాధి సిబ్బంది కృషి చేయాలని ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి సిబ్బందికి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామంలో 150 మందికి తగ్గకుండా కూలీలు పనులకు రావాలని, రోజువారి కూలి రూ.272 వచ్చే విధంగా మార్క్‌అవుట్ ఇవ్వాలని, నర్సరీల్లో పెంచుతున్న మొక్కలు వంద శాతం పెరిగేలా చూడాలని సూచించారు. ప్రతి నర్సరీలో 1000 మునగ మొక్కలు ఉండాలనే అంశాలను సిబ్బంది తప్పక పాటించాలని ఆదేశించారు. ఎన్ఎంఎంఎస్ యాప్‌లో వంద శాతం కూలీల హాజరు పంపాలన్నారు. పనుల విషయంలో అలసత్వం వహించే సిబ్బందిపై శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఏపీఓ కుర్మయ్య, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి

కొనసాగుతున్న వీఓఏల సమ్మె

పాన్‌గల్: ఐకేపీలో పనిచేస్తున్న గ్రామ సహాయకులు (వీఓఏ) తమ డిమాండ్ల సాధన కోసం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారానికి 9వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కళ్లకు గుడ్డలు కట్టుకొని వీఓఏలు నిరసన తెలిపారు. ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు అమలు, గ్రేడింగ్ విధానాన్ని రద్దు చేసి రెగ్యులర్‌గా వేతనాలు ఇవ్వడం వంటి డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించే వరకు సమ్మెను కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో వీఓఏల సంఘం నాయకులు రాజయ్యగౌడ్, శ్రీనివాసులు, భాగ్యమ్మ, స్వరూపరాణి, బాలరాజు, శేషయ్య, ధర్మయ్య, పద్మ, కృష్ణయ్య పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: ఐకేపీలో విధులు నిర్వహిస్తున్న వీఓఏల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఐకేపీ వీఓఏల సంఘం మండల అధ్యక్షుడు ఖాదరయ్య అన్నారు. మండల కేంద్రంలోని మండల సమాఖ్య వద్ద ఐకేపీ వీఓఏలు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారంతో 9వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కనీసవేతనం రూ.26 వేలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. రూ.10 లక్షల సాధారణ, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. ఐడీ కార్డులు ఇవ్వడంతో పాటుగా గ్రామ సంఘాల గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా జీతాలు ప్రతి నెల వ్యక్తిగత బ్యాంకు ఖాతాలో జమచేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఏడు నెలల జీతాలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఈశ్వరమ్మ, లక్ష్మి, కృష్ణయ్య, శ్రీశైలం, జ్యోతి, రేణుక, లత, గౌరమ్మ పాల్గొన్నారు.



పాన్‌గల్‌లో కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలుపుతున్న వీఓఏలు

కొనుగోలు కేంద్రాలతోనే రైతులకు ప్రయోజనం

పాన్‌గల్: యాసంగిలో రైతులు పండించిన వరి ధాన్యం విక్రయించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్ రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం సింగిల్ విండో ఆధ్వర్యంలో రేమద్దుల, మాధరావుపల్లి, శాగాపూర్, తెల్లరాళ్లపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. కేంద్రాలకు వచ్చే ధాన్యాన్ని తేమ పేరుతో రైతులకు ఇబ్బందులు కలిగించకుండా కొనుగోలు చేయాలని నిర్వాహకులను కోరారు. కార్యక్రమంలో విండో వైస్ చైర్మన్ కుర్వ బాలయ్య, సర్పంచ్‌లు మంజుల, సునీత, మౌనికయాదవ్, ఎంపీటీసీ సభ్యుడు సుబ్బయ్యయాదవ్, విండో డైరెక్టర్ బిచ్చమ్మ, సీఈఓ భాస్కర్‌గౌడ్, కృష్ణ, శేఖర్, డా.తిరుపతయ్య, తిరుపతి, విండో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



మాధరావుపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ, డీసీసీబీ డైరెక్టర్

జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

వనపర్తి టౌన్: తెలంగాణ గెజిటెడ్ కాలేజీ లెక్చరర్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గ ఎన్నికలను సోమవారం రాత్రి జిల్లా కేంద్రంలోని మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన జిల్లా కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడిగా వెంకట్‌ప్రసాద్, ప్రధాన కార్యదర్శి నాగరాజుయాదవ్, కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వెంకట్‌ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లాలోని వివిధ డిగ్రీ కళాశాలల లెక్చరర్లు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99516 02829
మహబూబ్‌నగర్ జిల్లా: 90102 34478, 90105 22215, 97051 35557, 90108 69797, జడ్చర్ల: 90100 76222
నాగర్‌కర్నూల్ జిల్లా: 90100 06785
వనపర్తి జిల్లా: 90100 68317
జోగులాంబ గద్వాల జిల్లా: 95539 55603
నారాయణపేట జిల్లా: 90109 62007
Office mail : advtmbnr@gmail.com